

విశ్వశాంతి మహాయాగం

నాగర్‌కర్నూల్‌లో విశ్వశాంతి మహాయాగ మహోత్సవం వైభవంగా కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸



రాజకీయాల్లో రాణించాలి

వాల్మీకులు రాజకీయాల్లో రాణించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.2 /25.4

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వారు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లతో మాట్లాడుతూ తమ పరిధిలోకి వచ్చిన దరఖాస్తులను వెంటనే జాప్యం లేకుండా పరిష్కరించాలని చెప్పారు. అయితే ప్రజలు ఇచ్చిన వినతుల్లో రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, పంచాయతీ, పింఛన్లు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమం ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్‌ఓ రవికుమార్, జెడ్పీ సీఈఓ రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.

వీఆర్‌ఓ, వీఆర్‌ఏల వ్యవస్థను..

గత ప్రభుత్వం తొలగించిన వీఆర్‌ఓ, వీఆర్‌ఏల వ్యవస్థలను తిరిగి పునరుద్ధరించాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి భీంరెడ్డి అదనపు కలెక్టర్ మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వ్యవస్థలను తొలగించడం వల్ల గ్రామాల్లో ప్రభుత్వ కార్యకలాపాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు. తమ అవసరం కోసం తప్పులకు కొత్త పద్ధతి ధరణి పెట్టి భూములను రాజకీయ నాయకులు, భూస్వాములకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. ఆయన వెంట నాయకులు ఆంజనేయులు, రాజునాయక్, రాములు ఉన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాలు ప్రభుత్వం విడుదల చేసిందని డీఈఓ రవీందర్ సోమవారం తెలిపారు. డ్రాయింగ్, లోయర్, హయ్యర్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, లోయర్, హయ్యర్ ఫలితాలకు సంబంధించి జిల్లాకేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో పరీక్ష రాసిన హాల్‌టికెట్ చూపిస్తే ఫలితాలు చెబుతారని, అనంతరం సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు.

‘మా స్కూల్‌కు టీచర్లు వస్తలేరు’

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్)/ చిన్నచింతకుంట: మా స్కూల్‌కు పాఠాలు బోధించడానికి టీచర్లు వస్తలేరని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నచింతకుంట మండలంలోని ఉంద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం పీడీఎస్‌యూ నాయకులతో కలిసి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం మాట్లాడుతూ పాఠశాలలో 160 మంది విద్యార్థులు చదువుకుంటుండగా.. ప్రధానోపాధ్యాయురాలితో పాటు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, వారు కూడా సక్రమంగా రావడం లేదని ఆరోపించారు. అయితే ఇటీవల జరిగిన బదిలీల్లో ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ఒక్క హెచ్‌ఎం తప్ప ఇతర ఉపాధ్యాయులు ఎవరూ లేరని వాపోయారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠాలు చెప్పేవారు లేకుండా పోయారని, తమ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.




టెర్రర్ హైవే

జాతీయ రహదారులపై నిత్యకృత్యమైన ప్రమాదాలు

ప్రమాదకరమైన ప్రాంతాలు..

ఉమ్మడి జిల్లాలో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాలను ఆర్టీఏ, పోలీస్ అధికారులు గుర్తించారు. వాటిలో తిమ్మాపూర్ ఎక్స్‌రోడ్, ఆశన్న దాబా, తిమ్మాపూర్ క్రాస్ రోడ్, షాద్‌నగర్ ఎక్స్‌రోడ్, రాయికల్, బాలానగర్, బాలానగర్ బ్రిడ్జి, రాజాపూర్, ముదిరెడ్డిపల్లి, గొల్లపల్లి, కావేరమ్మపేట ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, జడ్చర్ల, బూరెడ్డిపల్లి, మల్లెబోయిన్‌పల్లి, దివిటిపల్లి, జానంపేట, వేముల, కందూరు, అడ్డాకుల, వెల్టూర్, మోజర్ల, కనిమెట్ట, పాలెం, రాణిపేట ఎక్స్‌రోడ్, బీచుపల్లి, ఎర్రవల్లి ఎక్స్‌రోడ్, కొట్టం ఇంజినీరింగ్ కళాశాల, జింకలపల్లి, నారాయణపురం, బోరవెల్లి స్టేజీ దగ్గర నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటుచేసుకుంటుంది.

- మహబూబ్‌నగర్ నుంచి దేవరకద్ర వైపు వెళ్తున్న జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరిగే ప్రాంతాలు 10 వరకు ఉంటాయి. వాటిలో రాజీవ్ గృహకల్ప మలుపు, మైసమ్మ మలుపు, ఆల్‌మదీనా కళాశాల, ధర్మాపూర్ క్రాస్‌రోడ్, ధర్మాపూర్ సమీపంలో, చౌదర్‌పల్లి గేట్, జేపీఎన్‌సీఈ, కోడూరు, ఓబ్లాయిపల్లి మలుపు, దేవరకద్ర పెద్ద వంతెనపై తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి.
- నారాయణపేట జిల్లా ఎన్‌హెచ్–167పై మక్తల్ మండలం కాచ్‌వార్, బొందల్‌కుంట, దండు క్రాసింగ్ వద్ద, మాగనూరు మండలం వాడ్వాట్ స్టేజీ వద్ద.. మహబూబ్‌నగర్ నుంచి కోస్గి వెళ్లే దారిలో ఎన్‌హెచ్–167ఏపై కొమ్మిరెడ్డిపల్లి, రంగారెడ్డిపల్లి, సల్కర్‌పేట, రెడ్డిపల్లి స్టేజీల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.
- నాగర్‌కర్నూల్ జిల్లా 765 జాతీయ రహదారిపై వెల్దండ, రాగాయిపల్లి, తాండ్ర, వంగూరు మండలం వెలమలపల్లి వద్ద ఎక్కువ ప్రమాదాలు చోటు **చేసుకుంటున్నాయి.**
- జడ్చర్ల నుంచి కోదాడ మరో జాతీయ రహదారి– 167పై కూడా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. బోయిన్‌పల్లి, మిడ్జిల్, మున్ననూర్, కొత్తపల్లి, గంగాపూర్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ఉంటున్నాయి.



- నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతి వేగం, నిద్రమత్తే ప్రధాన కారణం
- కాగితాలకే పరిమితమైన ట్రామా కేర్ సెంటర్లు
- మహబూబ్‌నగర్– రాయచూర్ రహదారిపై కనిపించని హెచ్చరిక బోర్డులు
- మూడేళ్లలో 597 మంది మృతి.. 1,137 మంది క్షతగాత్రులు

మహబూబ్‌నగర్ క్రైం/జడ్చర్ల: ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. అయితే వీటిలో అత్యధికంగా జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లోనే ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారు. మూడేళ్ల వ్యవధిలో ప్రధానంగా 565 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఆయా ప్రమాదాల్లో 597 మంది మృత్యువాత పడగా.. మరో 1,137 మంది తీవ్ర క్షతగాత్రులు అయ్యారంటే.. ప్రమాదాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇందుకు మితిమీరిన వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, నిద్రమత్తు ప్రధాన కారణాలు కాగా.. వీటి కట్టడికి పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఎన్ని చర్యలు చేపడుతున్నా ఫలితం నామమాత్రంగా ఉంటోంది.

అయోమయానికి గురై..

జాతీయ రహదారితోపాటు అంతర్రాష్ట్ర రోడ్లపై రాత్రి సమయాల్లో సరిగా వెలుగులు ఉండవు. కనీసం గ్రామాల సమీపంలోనూ విద్యుత్ లైట్లు కనిపించడం లేదు. దీంతో అయోమయానికి గురవుతున్న వాహనదారులు మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. కొందరు యువకులు మద్యం తాగి వాహనాలు నడపడంతో రాత్రి సమయంలో వెలుగులు లేని దారుల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. నిబంధనల ప్రకారం రోడ్ల వెంట ఉండే గ్రామాల పొడవునా సెంట్రల్ లైటింగ్, సర్వీస్ రోడ్డు వెంట భారీ లైట్లను బిగించాలి. ఒకట్రెండు చోట్ల మినహా ఎక్కడా ఇవీ కనిపించడం లేదు. ప్రమాదకర స్థలాలను గుర్తించి జాగ్రత్తలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలి. రోడ్ల వెంట ఎక్కడా మద్యం తాగే అడ్డాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ముఖ్యంగా జాతీయ రహదారిపై రోడ్డు మధ్య ఉండే డివైడర్‌పై కంచె ఏర్పాటు చేయాలి. ఈ నిబంధనలు ఉమ్మడి జిల్లాలోని రహదారుల వెంట మచ్చుకైనా కనిపించవు.



సకాలంలో అందని వైద్యం

జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భంలో క్షతగాత్రులను వైద్య చికిత్సకు తరలించడంలో ఆలస్యమవుతోంది. ఈ కారణంగా అనేక మంది సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. ఎక్కువగా 108 అంబులెన్స్, ఆటోలు వంటి ప్రైవేట్ వాహనాల్లో తరలించాల్సి వస్తోంది. జాతీయ రహదారి అంబులెన్స్ సేవలు అంతగా లభించడం లేదు. జడ్చర్ల పరిధిలో చోటు చేసుకునే ప్రమాదాల స్థలం నుంచి చికిత్స కోసం తరలించేందుకు కనీసంగా అరగంట సమయం పడుతుంది. జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఎక్కువగా ఏనుగొండ ఎస్వీఎస్, జనరల్ ఆస్పత్రులకు రెఫర్ చేయాల్సి వస్తోంది. ప్రమాదం జరిగిన గంటలోపే సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటే ఎంతోమంది ప్రాణాలు నిలుస్తాయి. ఇందుకనుగుణంగా జడ్చర్లలో ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది.

నిబంధనలకు తూట్లు

ఉమ్మడి జిల్లాలోని అన్ని రహదారులపై నిబంధనలు అమలు కావడం లేదు. రోడ్ల వెంట ఉండే దాబాల ముందు లెక్కకు మించి భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలు నిలుపుతున్నారు. అక్కడే వాహనాలకు రిపేర్లు, పంక్చర్లు చేసుకోవడమే కాకుండా భోజనం వండుకుంటున్నారు. దీంతో రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులకు ఇబ్బందులు తలెత్తి ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. రోడ్ల వెంట 24 గంటలు వాహనంలో తిరుగుతూ పర్యవేక్షించాల్సిన (హైవే పెట్రోలింగ్) అధికారులు, సిబ్బంది సక్రమంగా కనిపించడం లేదు. దీంతో రోడ్లపై వాహనదారులు వారికి సంబంధించిన భారీ వాహనాలను రోడ్లపై ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు.

నామమాత్రంగా..

జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలపై ఆర్టీఏ, పోలీస్, ఆర్‌అండ్‌బీ, ఎల్‌ఎన్‌టీ ఎవరూ సరైన చర్యలు తీసుకోవడం లేదు. కేవలం రోడ్డు ప్రమాదాల వారోత్సవాలు సందర్భంలో హడావుడి చేసి ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారిపై ఎక్కడా కూడా అవసరమైన ప్రమాద సూచికలు లేకపోవడంతో రాత్రి 7 నుంచి తెల్లవారుజామున 5 గంటల ప్రాంతాల మధ్య ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై మలుపులు ఉన్న దగ్గర రేడియేషన్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

బ్రిడ్జి నిర్మించాలి..



బూరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ రోడ్డు దాటుతున్న అనేక మంది మృత్యువాత పడ్డారు. ఎంతోమంది క్షతగాత్రులయ్యారు. ఇక్కడ ఫ్లై ఓవర్ బ్రిడ్జిని వెంటనే నిర్మించాలి.

– నర్సింహులు, బూరెడ్డిపల్లి, జడ్చర్ల

మూడేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు			
ఏడాది	ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు
2022	222	233	407
2023	230	243	463
2024 (జూలై వరకు)	113	121	267

పాలమూరును సస్యశ్యామలం చేస్తాం



బాలానగర్ నుంచి గంగాపూర్ వరకు డబుల్‌లైన్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణ, కలెక్టర్ విజయేందిర, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్ తదితరులు

- ఉమ్మడి జిల్లాలో బీటీరోడ్ల అభివృద్ధికి చర్యలు
- కేసీఆర్‌కు కాళేశ్వరంపై ఉన్న శ్రద్ధ రాజకీయ భిక్షపెట్టిన పాలమూరుపై లేదు
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

జడ్చర్ల/ మిడ్జిల్/ రాజాపూర్/ నవాబ్‌పేట: ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను వచ్చే మార్చిలోగా పూర్తిచేసి పాలమూరును సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్, రాజాపూర్, బాలానగర్, నవాబ్‌పేట మండలాల్లో దాదాపు రూ.133 కోట్లతో చేపట్టనున్న బీటీరోడ్ల విస్తరణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జడ్చర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరంపై ఉన్న శ్రద్ధ కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిన పాలమూరుపై లేదని దుయ్యబట్టారు. త్వరలోనే ఉదండాపూర్ రిజర్వాయర్‌ను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. తాము అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. మూడు నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని, సీఎం రేవంత్‌రెడ్డి విశ్రాంతి తీసుకోకుండా ప్రతి శాఖను సమీక్షిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా పాలమూరుతోపాటు నల్లగొండ జిల్లా అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇన్నాళ్లు అభివృద్ధికి నోచుకోని సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో బీటీ రోడ్లకు రూ.350 కోట్లు కేటాయించామన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో బీటీ రోడ్లకు నిధులు మంజూరు చేశామని, టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామన్నారు. జడ్చర్ల నుంచి భూత్పూర్ వద్ద జాతీయ రహదారిని కలిపేలా బైపాస్ నిర్మిస్తామన్నారు. జడ్చర్లలో వంద పడకల ఆస్పత్రికి సంబంధించి మౌలిక వసతుల కల్పనతోపాటు తాత్కాలిక సిబ్బందిని 15 రోజుల్లో నియమిస్తామన్నారు. పాలమూరు యూనివర్సిటీలో ఖాళీలను భర్తీ చేసి రూ.20 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి మంత్రి పదవి లభిస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనువాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, నాయకులు శివకుమార్, బంగ్ల రవి, నర్సింహచారి, రామచ్రందయ్య, జహీర్, బాలాత్రిపురసుందరి, యాదయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపైనే దృష్టి..

ఎన్నికలప్పుడు మాత్రమే ఓట్లు అని.. ఆ తర్వాత అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. త్వరలో బెంగుళూర్– హైదరాబాద్ జాతీయ రహదారిని 12 లైన్లు విస్తరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి కోసం ఎంపీ సహకరించాలని కోరారు. అనంతరం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి కలిసి పనిచేస్తానన్నారు. జిల్లాలో అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని పేర్కొన్నారు. బాలానగర్‌లో చేపట్టిన రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో పలువురు నాయకులు స్థానిక సమస్యలపై మంత్రులకు వినతిపత్రాలు అందజేశారు.

హైవేపై ఘోర ప్రమాదం



- డీసీఎంను ఢీకొట్టిన ఏపీఎస్ ఆర్టీసీ బస్సు
- డీజిల్ ట్యాంక్ పగిలి చెలరేగిన మంటలు
- ఆర్టీసీ బస్సు దగ్ధం
- స్వల్పగాయాలతో బయటపడ్డ 16 మంది ప్రయాణికులు
- బూరెడ్డిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఘటన

- వివరాలు 8లో..

- జడ్చర్ల

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం అంగన్‌వాడీల ధర్నా



తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

మహబూబ్‌నగర్ రూరల్: రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం ఎదుట వందలాది మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా చేపట్టారు. అంతకు ముందు తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ పెంచుతూ వీఆర్‌ఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆయాలకు పాత పద్ధతిలోనే పదోన్నతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వరదగాలన్న, పట్టణ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కలతో చర్చలు నిర్వహిస్తామన్నారు. యూనియన్‌గా కూడా వస్తే ప్రభుత్వాన్ని కల్పిస్తానని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు సత్యమ్మ, టీచర్లు గౌసియాబేగం, కృష్ణవేణి, జ్యోతి, మంజుల, అనురాధ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

46 మంది అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు

దేవరకద్ర పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ముందస్తు సమాచారం, అనుమతి లేకుండా.. అమ్మ మాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించకుండా ధర్నాలో పాల్గొన్నారని సీడీపీఓ శైలశ్రీ అన్నారు. ఈ మేరకు వారికి సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మొత్తం 46 మంది విధులకు డుమ్మా కొట్టి సీఐటీయూ నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నట్లు సూపర్‌వైజర్లు గుర్తించారని తెలిపారు. వారంతా షోకాజ్ నోటీసు అందుకున్న 24 గంటలలోపు తమకు వివరణ ఇవ్వాలని సూచించారు. లేనిపక్షంలో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తామని పేర్కొన్నారు.

పంచాయతీల్లో బదిలీలు

- కార్యదర్శుల సీనియారిటీ జాబితా విడుదల
- జిల్లాలో 204 మంది కార్యదర్శులకు స్థానచలనం
- అర్ధరాత్రి వరకు కొనసాగిన కౌన్సెలింగ్ ప్రక్రియ



డీపీఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ కోసం వేచి ఉన్న పంచాయతీ కార్యదర్శులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): గ్రామ పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కార్యదర్శుల సీనియారిటీ జాబితాను తయారు చేశారు. దీని ప్రకారం బదిలీల ప్రక్రియ సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బందితోపాటు కార్యదర్శులు, మండల పరిషత్ అధికారుల (ఎంపీఓ)ను బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు జిల్లాలోని 441 గ్రామ పంచాయతీలకు గాను 204 మంది కార్యదర్శులు బదిలీ కానున్నారు. ఇందులో గ్రేడ్- 1లో ఐదు మంది, గ్రేడ్- 2లో ఆరుగురు, గ్రేడ్- 3లో 62 మంది, గ్రేడ్- 4లో 131 మంది కార్యదర్శులు ఉండగా.. వీరంతా బదిలీకి అర్హత సాధించారు. అయితే ఇందులో 40 శాతం మందికి మాత్రమే స్థానచలనం కల్పించాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయి. దీంతో నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసిన కార్యదర్శులను బదిలీ చేశారు. ఈ మేరకు నాలుగేళ్ల కాలం పూర్తయిన వారు డీపీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 11 సాయంత్రం వరకు ఆప్షన్ల గడువు ముగియగా.. 204 మంది కార్యదర్శులతోపాటు ఎంపీఓలు డీపీఓ కార్యాలయంలో ధ్రువపత్రాలు అందించారు.

మేజర్ పంచాయతీల కోసం..

తమకు అనువుగా ఉండటంతోపాటు ఎక్కువ ఆదాయం వచ్చే చోటుకు వెళ్లేందుకు పంచాయతీ కార్యదర్శులు పైరవీలు చేసుకున్నారనే విమర్శలు వినిపించాయి. ప్రధానంగా మేజర్ పంచాయతీలను ఎంచుకునేందుకు పోటీ పడినట్లు తెలుస్తుంది. జిల్లాలో ఉన్న మేజర్ గ్రామ పంచాయతీలతోపాటు మండల కేంద్రాలు, ఇసుక, ఇతర ఆదాయం ఎక్కువగా ఉండే జీపీలను ఎంచుకుంటున్నారు. ఎంపీఓలు సైతం తమకు ఆదాయం తెచ్చిపెట్టే చోటు కోసం ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో పైరవీలు మొదలుపెట్టినట్లు సమాచారం. అయితే పైరవీలకు తావులేకుండా స్థాన చలనం కల్పిస్తామని జిల్లా అధికార యంత్రాంగం చెబుతోంది.

డీపీఓ కార్యాలయంలో..

జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో జెడ్పీసీఈఓ రాఘవేంద్రరావు, డీపీఓ రాంరెడ్డి, డీఎల్‌పీఓ పండరినాథ్ పంచాయతీ కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు పెట్టుకున్న ఆప్షన్ ప్రకారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టారు. వారు కోరుకున్న స్థానాలను కేటాయిస్తూ బదిలీలు చేపట్టినట్లు అధికారులు చెప్పారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మల్లేష్ (ఫైల్)

తాడూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని ఎంగంపల్లి గ్రామానికి చెందిన మల్లేష్(35), రాజు ద్విచక్రవాహనంపై సోమవారం సాయంత్రం హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో గేటు దగ్గర బైక్‌ను పెద్దకొత్తపల్లికి వెళ్లే వాహనం ఢీకొట్టడంతో వెనక కూర్చున్న మల్లేష్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మల్లేష్‌కు భార్య అనితతోపాటు కూతురు, కొడుకు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఏఎస్ఐ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఏఎస్ఐ కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా అమరచింత మండలం చంద్రగఢ్‌కు చెందిన దత్తం జయమ్మ(50) తన కుమారుడు భీంరెడ్డితో కలిసి ఆటోలో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి ఆదివారం వస్తుండగా కావేరమ్మపేట సమీపంలో డీజిల్ కోసం ఆపారు. ఈ క్రమంలో జయమ్మ ఆటో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు వేగంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి, అటు నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. ఈ ఘటనపై జయమ్మ కుమారుడు ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మరో యువకుడు..

ఉప్పునుంతల: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ఈ నెల 10 ఉప్పునుంతల–జప్తి సదగోడు మార్గంలో మూలమలుపు వద్ద బోరుబండి, బైక్ ఢీకొన్న ఘటనలో మందుల శ్రీకాంత్ (19) తలకు తీవ్ర గాయం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే వెల్దండ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. శ్రీకాంత్‌కు తల్లి అలివేల, ముగ్గురు అక్కలు ఉన్నారు. శ్రీకాంత్ మృతితో మండల కేంద్రంలో విషాదచాయలు అలుముకున్నాయి.

యువకుడు అదృశ్యం

చౌటుప్పల్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు తిరిగిరాలేదు. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన ఉప్పరి కృష్ణసారథి(27) బీటెక్ వరకు చదువుకున్నాడు. ఉద్యోగ వేటలో భాగంగా చౌటుప్పల్‌లో నివాసముంటున్న తన అక్క వద్దకు 15రోజుల క్రితం వచ్చాడు. ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన కృష్ణసారథి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

బాలుడిపై కత్తితో దాడి

- జిల్లాకేంద్రంలో గంజాయి మత్తులో పెరుగుతున్న దాడులు

మహబూబ్‌నగర్ క్రైం: పాలమూరు పట్టణంలో గంజాయి మత్తులో కత్తులతో దాడి చేసిన ఘటన మరవక ముందే మరో ఉదంతం చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది. యువత గంజాయికి అలవాటుపడి ఆ మత్తులో ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి జిల్లాకేంద్రంలో నెలకొంది. ఇటీవల చిన్న విషయాలకు హత్యలు చేసే వరకు వెళ్తున్నారు. ఈ నెల 13న సాయంత్రం పట్టణంలోని టీడీగుట్ట కు చెందిన ఓ బాలుడిని వీరన్నపేటకు చెందిన మరో బాలుడు వీరన్నపేటలో కత్తితో దాడి చేశాడు. కడుపు భాగంలో తీవ్ర గాయం కావడంతో ప్రస్తుతం సదరు బాలుడు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారంపై వన్‌టౌన్ సీఐ అప్పయ్యను సంప్రదించగా కేసు నమోదు చేశామని, మంగళవారం నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తామని చెప్పారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

నాగర్‌కర్నూల్ క్రైం: గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన సోమవారం నాగర్‌కర్నూల్ చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్‌కు చెందిన సంతోష్‌నాయక్, ఎండబెట్లకు చెందిన గణేష్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద గుట్ట వద్ద గంజాయి తాగుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వారి నుంచి 40 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలం పెద్దగూడెంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 93 బస్తాల రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులతో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్ పట్టుకున్నారు. ఆయన వివరాల మేరకు.. కొత్తకోటకు చెందిన సిలిమర్తి కురుమూర్తి సమీప గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరించి, పెద్దగూడెంలోని ఇంట్లో నిల్వ చేశాడు. 93 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వనపర్తి స్టాక్ సెంటర్‌కు తరలించి, కురుమూర్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

హైవేపై ఘోర ప్రమాదం


బూరెడ్డిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద జాతీయరహదారిపై దగ్ధమవుతున్న ఆర్టీసీ బస్సు

డీసీఎంను ఢీకొట్టిన ఏపీఎస్ ఆర్టీసీ బస్సు

- డీజిల్ ట్యాంక్ పగిలి చెలరేగిన మంటలు
- ఆర్టీసీ బస్సు దగ్ధం
- స్వల్పగాయాలతో బయటపడ్డ 16 మంది ప్రయాణికులు
- జడ్చర్ల బూరెడ్డిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఘటన


పూర్తిగా దగ్ధమైన బస్సు

జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బూరెడ్డిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద 44వ నంబర్ జాతీయరహదారిపై యూటర్న్ తీసుకుంటున్న డీసీఎంను ఏపీఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో డీసీఎం డీజిల్ ట్యాంక్ పగిలింది. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయపడ్డ కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఆర్టీసీ బస్సుకు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ధర్మవరం ఆర్టీసీ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు హైదరాబాద్ ఇంబ్లీ బస్‌స్టేషన్ నుంచి ధర్మవరం బయల్దేరింది. కర్నూల్, గుత్తి, అనంతపూర్‌లలో మాత్రమే బస్సుకు స్టాప్ ఉండటంతో జడ్చర్ల బస్టాండ్‌లో ఆగకుండా ముందుకు వెళ్లింది. ఈక్రమంలో సిద్దిపేట నుంచి మహబూబ్‌నగర్‌కు లోడ్‌తో బయల్దేరిన డీసీఎం కావేరమ్మపేట వద్ద సర్వీస్‌రోడ్డు గుండా వెళ్లాల్సి ఉండగా.. డ్రైవర్ ఏమరుపాటుతో నేరుగా బ్రిడ్జి మీదుగా వెళ్లింది. మహబూబ్‌నగర్‌కు వెళ్లేందుకుగాను బూరెడ్డిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద డీసీఎం యూటర్న్ తీసుకుంటుండగా.. వెనుకే వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టి, కుడివైపు రోడ్డు కిందకు దూసుకెళ్లింది. బస్సు డ్రైవర్లు డి.సంజీవ్ నాయుడు, కదీరప్పలు ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో ఎమర్జెన్సీ డోర్, కిటికీల అద్దాలను పగులగొట్టుకుని బయటికి వచ్చారు. బస్సు డ్రైవర్ స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోవడంతో దాదాపు 15 నిమిషాల పాటు శ్రమించి డ్రైవర్‌ను బయటికి తీసుకువచ్చారు.

నిమిషాల వ్యవధిలో మంటలు..

ప్రమాదంలో డీసీఎం డీజిల్ ట్యాంక్ పగిలి ఆర్టీసీ బస్సుపై పడింది. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటికి దిగిన నిమిషాల వ్యవధిలో మంటలు చెలరేగాయి. దీంతో ఆర్టీసీ బస్సు పూర్తిగా దగ్ధమైంది. కాగా, ప్రమాదం చోటు చేసుకున్నప్పుడు బస్సు వేగం 50 కి.మీ. లోపే ఉంటుందని అదనపు డ్రైవర్ కదీరప్ప తెలిపారు. తమ డిపోకు చెందిన బస్సులకు 60 కి.మీ. స్పీడ్ లాక్ ఉంటుందన్నారు.

అధికారుల విచారణ..

ఏపీఎస్ ఆర్టీసీ హైదరాబాద్ విభాగానికి చెందిన డివిజనల్ మేనేజర్ కృష్ణ కిషోర్‌నాథ్, డీఎం సుదాకర్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. బూరెడ్డిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బస్సు ప్రమాదంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

- బస్సు ప్రమాదంపై ధర్మవరం ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ ఆరా తీశారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడంతో పాటు ప్రయాణికుల వివరాలను స్థానిక మీడియా ద్వారా తెలుసుకున్నారు.

నిద్రమత్తే కారణం..?

ఆర్టీసీ బస్సు ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీసీఎం యూటర్న్ కోసం డ్రైవర్ సైడ్ ఇండికేటర్స్ వేసినా.. బస్సు డ్రైవర్ గమనించక పోవడంపై అనుమానాలు కలుగుతున్నాయి. కాగా, ప్రమాద సమయంలో బస్సు వేగంగా లేకపోవడం, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. జడ్చర్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునే సరికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంపై బస్సు డ్రైవర్ కదీరప్ప ఫిర్యాదు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

బస్సు ప్రమాద ఘటనా స్థలాన్ని సోమవారం ఎస్పీ జానకి పరిశీలించారు. బస్సు దగ్ధం కావడానికి గల కారణాలను తెలుసుకున్నారు. బూరెడ్డిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద తరచూగా ప్రమాదాలు చోటు చేసుకోవడానికి గల కారణాలపై విచారించారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. ఎస్పీ వెంట ఎస్ఐ చంద్రమోహన్ ఉన్నారు.

16 మందికి గాయాలు..

రోడ్డు ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సులో మొత్తం 36 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో 15 మంది ప్రయాణికులతో పాటు డ్రైవర్ డి.సంజీవ్ రాయుడు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో కర్నూల్, గుత్తి, అనంతపూర్, ధర్మవరం ప్రాంతాలకు చెందిన గాయత్రి, నందిని, సునీల్, జయకుమార్, నరేందర్, నర్సప్ప, నిరంజన్, లక్ష్మీదేవి, అర్చన, మైథిలీ, దస్తగిరి, మోహన్, కార్తీక్, డ్రైవర్ సంజీవ రాయుడు ఉన్నారు.




జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికురాలు.. బస్సు డ్రైవర్ సంజీవరాయుడు.. గాయపడిన దస్తగిరి, కార్తీక్

ప్రయాణికులను అప్రమత్తం చేశాం..

డీసీఎంను బస్సు ఢీకొట్టినప్పుడు పెద్ద శబ్దం వచ్చింది. ప్రమాద సమయంలో నిద్రలో ఉన్న నేను వెంటనే తేరుకుని బస్సులోని ప్రయాణికులను అప్రమత్తం చేశా. కిటికీల అద్దాలు పగులగొట్టడంతో అంతా బయటకు వచ్చారు. డ్రైవర్ స్టీరింగ్ లాక్ అయి ఇరుక్కుపోయాడు. 15 నిమిషాలు కష్టపడి డ్రైవర్‌ను బయటకు తీశాం.

– కదీరప్ప, బస్సు అదనపు డ్రైవర్, ధర్మవరం

డీసీఎం అకస్మాత్తుగా యూటర్న్ తీసుకుంది..

హైదరాబాద్ నుంచి ధర్మవరం బయల్దేరిన మేము మధ్యరాత్రి జడ్చర్లలోని ఓ హోటల్‌లో ఛాయ్ తాగి కొద్ది దూరం వెళ్లాను. అప్పుడు బస్సు 40 నుంచి 50 కి.మీ. స్పీడ్‌లో ఉంది. వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం బస్సును ఓవర్‌టెక్ చేసి సడెన్‌గా యూటర్న్ తీసుకునేందుకు మళ్లింది. వర్షంలో ముందున్న డీసీఎం సక్రమంగా కనిపించక పోవడంతో పాటు బస్సు బ్రేక్ సడెన్‌గా పడక పోవడంతో డీసీఎంను ఢీకొట్టింది.

– సంజీవ రాయుడు, బస్సు డ్రైవర్

కొనసాగుతున్న విశ్వశాంతి మహాయాగం


మృత్యుంజయ హోమంలో పాల్గొన్న భక్తులు

నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రంలోని ఓంనగర్‌కాలనీలో శ్రీకృష్ణ కాలచక్రం అయుత చండీ, అతి రుద్రం, శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం వైభవంగా కొనసాగుతోంది. సోమవారం దశ సహస్ర ఉమా పార్థీవ లింగార్చన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన శాస్త్రోక్తంగా జరిపించారు. 201 మంది దంపతులతో అమృత పాశుపత మృత్యుంజయ, రుద్రహోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ మాట్లాడుతూ.. ఉమా పార్థీవ లింగాలను దర్శించినా, ఆరాధించినా, పూజించినా విశేష పుణ్యఫలం లభిస్తుందన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు భక్తులకు వేద ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. మంగళవారం సుబ్రమణ్యేశ్వరస్వామి హోమాలు, సాయంత్రం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు స్వామీజీ తెలిపారు.



కురుస్తున్న పేదల ఆస్పత్రి

ఉమ్మడి జిల్లాలోని పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న జనరల్ ఆస్పత్రి శిథిలావస్థకు చేరింది. జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆస్పత్రిలో కొన్ని వార్డుల్లో కురుస్తోంది. జనరల్ ఆస్పత్రిని సుమారు 53 ఏళ్ల కిందట నిర్మించడంతో పూర్తిగా పాతబడింది. అయితే సోమవారం కురిసిన వర్షానికి క్యాజువాలిటీ విభాగంలో నీళ్లు లీకయ్యాయి. ఆస్పత్రి అన్ని విభాగాల్లో సైతం పైకప్పు పూర్తిగా దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రమాదాలు జరగక ముందే చర్యలు చేపట్టాలని రోగులు కోరుతున్నారు.

– పాలమూరు

జూరాలకు 3,894 క్యూసెక్కుల వరద

- నెట్టెంపాడుకు కొనసాగుతున్న నీటి పంపింగ్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు సోమవారం ఎగువ నుంచి 3,894 క్యూసెక్కుల వరద వచ్చినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపు ద్వారా నీటి పంపింగ్ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. నెట్టెంపాడుకు 656 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 110, భీమా లిఫ్ట్–1కు 650, ఎడమ కాల్వకు 390, భీమా లిఫ్ట్–2కు 766 క్యూసెక్కులు మొత్తం 1,806 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.721 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు వివరించారు.

శ్రీశైలంలో 813.1 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885.0 అడుగులు.. 215.8070 టీఎంసీల సామర్థ్యం కాగా సోమవారం జలాశయంలో 813.1 అడుగుల నీటిమట్టం, 36.1014 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు వివరించారు. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. స్థానికంగా 15.40 మి.మీ. వర్షపాతం నమోదైంది. జలాశయం నుంచి 59 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

రామన్‌పాడులో నిలకడగా..

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,020 అడుగుల నీటిమట్టం ఉందని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల సమాంతర, ఎడమ కాల్వ ద్వారా నీటి సరఫరా లేదన్నారు. ఎన్టీఆర్ కాల్వకు 350 క్యూసెక్కులు, వివిధ లిఫ్ట్‌లకు 766, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని వివరించారు.


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

వాల్మీకులు రాజకీయాల్లో రాణించాలి


మాట్లాడుతున్న మాజీ మంత్రి, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

- మాజీ మంత్రి, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

అలంపూర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వాల్మీకులు ఐక్యతతో విజయాలు దక్కించుకుంటేనే రాష్ట్రంలోని ఏ రాజకీయ పార్టీ అయినా తగిన గుర్తింపునిస్తుందని ఏపీ మాజీ మంత్రి, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం అలంపూర్ చౌరస్తాలోని ఏజీఆర్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని తాజా మాజీ ప్రజాప్రతినిధుల సన్మాన సభ ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ మాజీ మంత్రి, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, ఎమ్మెల్సీ మధుసూదన్‌బాబు, అలంపూర్ నియోజకవర్గ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వాల్మీకి సంఘం నాయకులు, వాల్మీకులు హాజరయ్యారు. ముందుగా వారు అలంపూర్ ఆలయాల దర్శించుకొని అలంపూర్ చౌరస్తాకు చేరుకోగా వారికి భారీ గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా సభస్థలికి చేరుకుని తాజా మాజీ ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. వాల్మీకి కుటుంబంలో పుట్టినందుకు అదృష్టంగా భావిస్తున్నానని, ఎక్కడికి వెళ్లినా ధైర్యంగా బోయ వాల్మీకుడినని చెప్పుకోవడానికి గర్వపడుతున్నట్లు చెప్పారు. అలంపూర్ నియోజకవర్గంలో 50 వేల మంది ఓటర్లున్నా.. రాజకీయంగా వెనుకబడుతుండటం బాధగా ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలను పక్కనబెట్టి ఐక్యతతో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను గెలిపించుకోవాలని కోరారు. 2026లో నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అలంపూర్ జనరల్ కేటగిరీలోకి వస్తుందని, అన్ని కులాలను కలుపుకొని వాల్మీకి బిడ్డ ఎమ్మెల్యేగా గెలుపొందడానికి అవకాశం ఉందన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ వాల్మీకులు ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో పెద్ద సంఖ్యలో వాల్మీకులు ఉన్నప్పటికీ రాజకీయంగా వెనుకబడ్డారన్నారు. చట్టసభలో వాల్మీకుల ప్రాతినిధ్యం పెరిగితే ఎస్సీ జాబితా సాధించుకోవడానికి సమస్య ఉండదని తెలిపారు. ఎమ్మెల్సీ మధుసూదన్‌బాబు మాట్లాడుతూ.. రాయలసీమలో వాల్మీకులు పోరాటం చేయడంతోనే ప్రజాప్రతినిధులుగా వచ్చామన్నారు. తెలంగాణలోనూ పోరాటం చేసి వాల్మీకులు చట్టసభల్లోకి రావాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం కూడా రాబోయే రోజుల్లో వాల్మీకులకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏడీసీసీబీ మాజీ చైర్మన్ వీరాంజనేయులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ, ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా నాయకులు హన్మంతునాయుడు, నీలి శ్రీనివాసులు, రామనాయుడు, మధునాయుడు, మేడికొండ వెంకటేష్, రమణ, ధనుంజయ్, పైపాడు శ్రీనివాసులు, మల్లికార్జున్, జగన్‌మోహన్ నాయుడు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణయ్య నాయుడు, చిన్న కృష్ణయ్య, పరమేశ్, కుమార్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దశల వారీగా పోరాటం



కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న పెన్షన్‌దారులు, నాయకులు

జిడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్రంలోని పెన్షన్‌దారుల న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జేఏసీ రాష్ట్ర నాయకుడు భరత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సంఘం నాయకులు స్థానిక కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను జేఏసీ ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. ఒకటో తేదీన పింఛన్ వేయడం తప్పా ఇతర సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపించారు. బకాయి ఉన్న నాలుగు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని, అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈహెచ్‌ఎస్‌ను యూనివర్సిటీలు, జీహెచ్‌ఎంసీ, ఎయిడెడ్ విద్యాసంస్థలు, మార్కెటింగ్‌శాఖ పింఛనర్లకు వర్తింపజేయాలని కోరారు. ప్రతి జిల్లాలో అన్ని వసతులతో రెండు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన 5 శాతం ఐఆర్‌ను కనీసం 20 శాతానికి పెంచాలని, పీఆర్‌సీ నివేదిక వెంటనే తెప్పించుకుని అమలు చేయాలన్నారు. ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లాలో పెన్షన్‌దారుల సంక్షేమ భవన్ నిర్మించాలని కోరారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్‌కు డిమాండ్ల వినతిపత్రం అందజేశారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర పరిశీలకులు ఓంప్రకాష్, ప్రకాష్‌రావు, తెలంగాణ పెన్షన్‌దారులు, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామదాసు, కార్యదర్శి కిష్టయ్య, రాఘవరెడ్డి, వెంకట్‌స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి లేఖపై స్పందించని హైవే అధికారులు


ప్రమాదకరంగా ఉన్న శంకరాయపల్లి తండా గేట్

జడ్చర్ల టౌన్: జడ్చర్ల–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై శంకరాయపల్లి తండా గేట్ వద్ద పైవంతెన నిర్మాణానికి పరిశీలించాలని జాతీయ రహదారులశాఖ ఈఈకి జిల్లా రోడ్లు, భవనాలశాఖ అధికారి లేఖ రాసినా స్పందించడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. జాతీయ రహదారిగా మారిన తరువాత తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, మూడేళ్లలో ఆరుగురు మృతిచెందగా.. పలువురు క్షతగాత్రులయ్యారు. ఈ ప్రాంతంలో పై వంతెన నిర్మించాలంటూ తండాకు చెందిన గోపాల్‌నాయక్ తదితరులు ముఖ్యమంత్రి ప్రజావాణిలో ఫిబ్రవరి 10న వినతిపత్రం సమర్పించారు. పరిశీలించిన అధికారులు జిల్లా రోడ్లు, భవనాలశాఖ అధికారి రాములుకు ప్రతిని పంపించి పరిశీలించాలని సూచించారు. ఆ లేఖ, సూచనలు అందుకున్న ఆయన మే 21న జాతీయ రహదారులశాఖ ఈఈకి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అవసరమైతే వంతెన నిర్మాణం చేపట్టాలంటూ లేఖ రాశారు. లేఖ అందుకున్న శాఖ అధికారులు రెండు, మూడురోజుల్లో సందర్శిస్తామని వివరించారు. సుమారు 52 రోజులు కావస్తున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ప్రమాదాల నివారణకు పోలీసులు తాత్కాలికంగా స్టాపర్లు ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి పై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

క్రీడల్లో సాయి అనన్య ప్రతిభ

- హ్యాండ్‌బాల్, తైక్వాండోలో రాణింపు


తైక్వాండోలో ప్రథమస్థానంలో నిలిచి మెమొంటో అందుకుంటున్న సాయి అనన్య

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రానికి చెందిన సాయి అనన్య రెండు క్రీడల్లో ప్రతిభ చాటుతూ అందరికి ఆదర్శంగా నిలుస్తుంది. తండ్రి అనిల్‌కుమార్ వ్యాయామ ఉపాధ్యాయుడు కావడం వల్ల సాయి అనన్యను చిన్నప్పటి నుంచి క్రీడల్లో ప్రోత్సహించారు. దీంతో సాయి అనన్య ఇటు హ్యాండ్‌బాల్, అటు తైక్వాండో క్రీడలో రాణిస్తుంది. ఏడేళ్ల నుంచి తైక్వాండోలో కోచ్ సాయిలు వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటుంది. తైక్వాండోలో ఈ ఏడాది బ్లాక్ బెల్టును అందుకుంది. పలుసార్లు జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో పాల్గొంది. ఇటీవల మహబూబ్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో క్యాడెట్ (అండర్ 14–16 విభాగం)లో మెరుగైన ప్రతిభచాటి బంగారు పతకం సాధించింది.

- సాయి అనన్య హ్యాండ్‌బాల్ క్రీడలో కూడా తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తోంది. వరంగల్‌లో జరిగిన సబ్‌జూనియర్ విభాగం రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో జిల్లాకు ప్రాతినిధ్యం వహించింది. ఈ ఏడాది ఢిల్లీలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ బాలికల జట్టు తరపున ఆడింది. తైక్వాండో క్రీడలో అంతర్జాతీయస్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యమని సాయి అనన్య అంటుంది.